# ఇన్లాండ్ లెటర్ కథలు



## పశ్చాతాపం

లింగరాజు దొంగ. దొంగతనాలు చేయడంలో నేర్పరి. ఇంట్లో మాత్రము తాను దొంగతనము చేస్తున్నట్టు కాకుండా పని చేస్తున్నట్టు చెప్పేవాడు. అతడు ప్రొద్దున్నే భోజనం చేసి మళ్ళీ రాత్రి వచ్చేవాడు కావడంతో అతని మాటల్ని భార్యాబిడ్డలు నమ్మేవారు.

లింగరాజుకు ఇద్దరు బిడ్డలు. ఒక కొడుకు మొదటి బిడ్డ పెండ్లికి ఎదగడంతో పెండ్లి ప్రయత్నాలు చూశాడు. అతనికి ఆ గ్రామములోనే మంచి సంబంధం దొరకడంతో ఆ సంబంధము ఖాయం చేశాడు. మరో పక్షం రోజుల్లో పెండ్లి నిశ్చయమైంది.

పెండ్లి దగ్గరపడడంతో అతని భార్య బిడ్డ పేరుమీద బ్యాంకులో వేసిన రూపాయలను 'డ్రా' చేద్దామని ఓ రోజు ప్రక్కనే వున్న పట్టణానికి వెళ్ళింది. భార్య ఊర్లో లేకపోవడంతో "ఈ రోజు ఎక్కువ దొంగతనాలు చేయాలని" లింగరాజు కొంచెం తొందరగానే వెళ్ళాడు.

కాని ఆ రోజు అతని దురదృష్టమో ఏమో చీకటి పడుతున్నాగాని అతనికి దొంగతనం చేయడానికి ఏ అవకాశము రాలేదు. ఇక ఇవ్వాళ్ళ ఏం దొరకవేమోనని అనుకుంటున్న సమయంలో దూరం నుంచి చీకటిలో బస్సు రావడం కనిపించింది. బస్సు చూస్తూనే అతని కండ్లు మెరిశాయి.

బస్సు ఆగడంతో ఒకరినొకరు తోసుకొంటూ దిగసాగారు. అదే చివరి బస్సు కావడంతో జనం ఎక్కువమందే వున్నారు. ఇదే అదను సమయం అనుకొని లింగరాజు గుంపులో చొరబడి చేతికి వచ్చిన సంచిని లాక్కుని వెనక్కు చూడకుండా పరిగెత్తాడు. మధ్యలో డబ్బు చూసుకుని "ఈ డబ్బుతో బిడ్డ పెండ్లి జరపవచ్చునని" ఆనందంతో ఇంటికి వచ్చాడు.

కొద్దిసేపటికి అతని భార్య పాలిపోయిన మొఖంతో ఇంటికి వచ్చింది. భార్య ముఖాన్ని చూస్తూ సంగతేంటని అడిగాడు. అతని భార్య దుఃఖంతో "వాడెవడో దొంగ వెధవ డబ్బు ఎత్తుకుపోయాడు అన్నది. భార్య మాటలకు దొంగతనం చేసింది తానేనని తెలుసుకున్నాక చాలా బాధపడ్డాడు లింగరాజు ఇంకెవరైనా ఆ డబ్బును దొంగిలించి వుంటే ఏమయ్యేది అని తనలో తను పశ్చాత్తాపపడి అప్పటినుండి దొంగతనం మానేశాడు.

-వై.జగన్నాథపూరి
మెళియాపుట్టి, శ్రీకాకుళం

## క్రొత్త ముగింపు

నందు గమ్యం లేనివాడిలా ట్యాంక్ బండ్ మీద నడుస్తున్నాడు. సమయం అర్థరాత్రి దాటిందేమో అస్సలు జన సంచారమే లేదు, ఉండుండి అటూ ఇటూ పోయే వాహనాల రొద తప్ప. నందుకి ఆ రోజు ఉదయం నుండి జరిగిన సంఘటనలొక్కొక్కటే గుర్తుకు రాసాగాయి.

గుండె కవాటానికి రంధ్రం పడ్డ నాలుగేళ్ళ కొడుక్కి వైద్యం చేయించే స్థోమత నందు గుమాస్తాగిరీ జీవితాన్కి సాధ్యం కాకపోవడంతో వాడు కృంగి, కృశించి ఈ రోజు ఉదయమే తనువు చాలించాడు. ఆ షాక్ తట్టుకోలేని అతని భార్య కూడా నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంతటి విషాదాన్ని జీర్ణించుకోలేని నందు మనస్సులో తను కూడా ఆత్మహత్య చేసుకుందామన్న కోరిక మరింత బలపడడంతో వేగంగా ముందుకు నడవసాగాడు.

ఇంతలో అతనికి కొంచెం దూరంలో ఎవరో స్త్రీ ట్యాంక్ బండ్ రైలింగ్ మీదగా హుస్సేన్‌సాగర్‌లో దూకే ప్రయత్నంలో వుండటం చూసిన నందు ఒక్క అంగలో దూసుకువెళ్ళి ఆమెను ఇవతలికి లాగాడు.

"ఇదేమిటి తను ఆత్మహత్య చేసుకుందామని వచ్చి... ఇంకొకర్ని ఆ పరిస్థితి నుండి రక్షించాల్సి రావడం విచిత్రంగా ఉందే" అనుకున్నాడు నందు మనస్సులో.

కొంచెం స్థిమితపడ్డాక వివరాలడిగిన నందుతో ఆమె తన పేరు రమని, తనో ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నానని అయితే నాలుగు రోజుల క్రితం జరిగిన స్కూటర్ ఏక్సిడెంట్‌లో తన భర్త, ఒక్కగానొక్క కూతురు చనిపోవడంతో బ్రతుకుపై విరక్తితో తను ఆత్మహత్యకు పాల్పడ్డానని చెప్పింది.

అంతా విన్న నందుకి తమ ఇద్దరి సమస్యలకు ఓ క్రొత్త ముగింపు స్ఫురించడంతో ఆమెకు తన కథంతా వివరించి "మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని నేను భార్యగా స్వీకరిస్తాను, ఒకరికొకరు తోడై జీవితాన్ని పంచుకుందాం. మరి మీరేమంటారు?" అన్నాడు.

ఆమె అందుకు అంగీకారం తెలపడంతో చావు చివరి మెట్టు నుండి కొత్త జీవితంలోకి తొలి అడుగు వేస్తూ... ఇద్దరూ చెట్టపట్టాలేసుకుని ముందుకు సాగిపోయారు. హుస్సేన్ సాగర్‌లోని బుద్ధ విగ్రహం సాక్షిగా.

-అరుణాచ్యుత్

